
సాక్షి రాజన్న సిరిసిల్ల

మంగళవారం । 7 । అక్టోబర్ । 2025



ఎల్‌ఎండీకి నీటి విడుదల

బోయినపల్లి(చొప్పదండి): మిడ్‌మానేరు నుంచి ఎల్‌ఎండీకి 3,500 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. మానేరు, మూలవాగుల్లోంచి 3,800 క్యూసెక్కుల వరద ఇన్‌ఫ్లోగా వస్తోంది.



సామూహిక సీమంతం

తంగళ్లపల్లి(సిరిసిల్ల): స్థానిక మార్కండేయ ఆలయంలో గర్భిణీలకు సోమవారం సామూహిక సీమంతం నిర్వహించారు. డీడబ్ల్యూవో లక్ష్మీరాజం, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



వాతావరణం

జిల్లాలో ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లా వ్యాప్తంగా భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

గ్రీవెన్స్ డేకు 18 ఫిర్యాదులు



సిరిసిల్ల క్రైం: బాధితులకు భరోసాగా ఉండేందుకు జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రతీ సోమవారం గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నట్లు ఎస్పీ మహేశ్ బీ గీతే తెలిపారు. 18 ఫిర్యాదులు స్వీకరించినట్లు వివరించారు. ఫిర్యాదులను పరిష్కరించాలని అధికారులకు ఫోన్‌చేసి ఆదేశించారు.

న్యాయసేవల క్లినిక్ ప్రారంభం



సిరిసిల్లకల్చరల్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో రాజీవ్‌నగర్ బస్తీ ఆస్పత్రిలో న్యాయ సేవల క్లినిక్‌ను సంస్థ జిల్లా కార్యదర్శి రాధికా జైస్వాల్ సోమవారం ప్రారంభించారు. డ్రగ్ అవేర్‌నెస్, వెల్‌నెస్, నేవిగేషన్ ఫర్ డ్రగ్ ఫ్రీ ఇండియా(డాన్)లో భాగంగా మత్తు పదార్థాలకు బానిసలైన వారిని గుర్తించి స్వస్థత చేకూర్చేందుకు ఈ కేంద్రం పనిచేస్తుందని తెలిపారు. లోక్ అదాలత్ సభ్యుడు చింతోజు భాస్కర్, మానసిక వైద్య నిపుణుడు ప్రవీణ్, డాక్టర్ మణివర్మ, నర్సింగ్ ఆఫీసర్ స్వాతి పాల్గొన్నారు.

రోడ్డు కబ్జాను అడ్డుకోండి

సిరిసిల్లటౌన్: రోడ్డు కబ్జా చేసి నిర్మిస్తున్న భవనం పనులు అడ్డుకోవాలని ఏఐఎఫ్టీయూ న్యూ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సోమిశెట్టి దశరథం కోరారు. మున్సిపల్ ఎదుట సోమవారం నిరసన తెలిపిన సందర్భంగా మాట్లాడారు. విద్యానగర్ నుంచి తాడూరు వెళ్లే దారిలో సర్వేనంబర్ 526లో రోడ్డును ఆక్రమించి భవనం నిర్మిస్తున్నారన్నారు. వెంటనే ఆ నిర్మాణాన్ని అడ్డుకోవాలని కోరారు. కొత్తచెరువు నాలాలు, శాంతినగర్ రోడ్ డ్యామ్ ఆక్రమణలపై విచారణ చేపట్టాలని కోరారు. కొంపల్లి విజయ్‌కుమార్, తడుక రాములు, గుజ్జ దేవదాస్, సత్తయ్య, శ్రీధర్ పాల్గొన్నారు.

తెల్లవార్లూ కురిసిన వర్షం


సిరిసిల్ల: ఆదివారం రాత్రి నుంచి సోమవారం తెల్లవారుజాము వరకు వర్షం కురిసింది. కోనరావుపేటలో అత్యధికంగా 56.0 మిల్లీమీటర్లు కురిసింది. సిరిసిల్లలో 50.7, రుద్రంగిలో 28.7, చందుర్తిలో 24.4, బోయినపల్లిలో 17.8, వేములవాడలో 47.6, వీర్నపల్లిలో 27.6, వేములవాడ రూరల్‌లో 19.7, ఎల్లారెడ్డిపేటలో 42.0, గంభీరావుపేటలో 41.5, ముస్తాబాద్‌లో 43.4, తంగళ్లపల్లిలో 25.1, ఇల్లంతకుంటలో 10.6 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. జిల్లాలో 33.5 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది.

కష్టపడిన వారికి గుర్తింపు



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): పార్టీలో దశాబ్దకాలంగా కష్టపడి పనిచేస్తున్న వారికి గుర్తింపు ఉంటుందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి కోరారు. ఎల్లారెడ్డిపేటలోని పార్టీ ఆఫీస్‌లో సోమవారం ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల కార్యకర్తలతో సమావేశమయ్యారు. రెండు మండలాల్లో జెడ్పీటీసీ, ఎంపీటీసీ అన్ని స్థానాలు కైవసం చేసుకోవాలన్నారు. రాచర్ల గొల్లపల్లికి చెందిన 50 మంది కాంగ్రెస్‌లో చేరారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, ఏఎంసీ చైర్మన్లు సాబేరా బేగం, రాములునాయక్, వైస్‌చైర్మన్లు గుండాడి రాంరెడ్డి, లక్ష్మణ్, పార్టీ మండలాధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, భూత శ్రీనివాస్ పాల్గొన్నారు.

జిల్లా సరిహద్దుల్లో తనిఖీ



వేములవాడరూరల్: రాజన్నసిరిసిల్ల–జగిత్యాల జిల్లా సరిహద్దు మండలంలోని ఫాజుల్‌నగర్ వద్ద పోలీసులు సోమవారం రాత్రి తనిఖీలు చేపట్టారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో వాహనాలను ఆపి తనిఖీ చేశారు. రూ.50వేలకు మించి నగదు తరలిస్తే సీజ్ చేస్తామని ఎస్సై వెంకట్రాజం తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన వారికి, ధ్రువీకరణ పత్రాలు సరిగా లేని వారికి జరిమానా విధించారు.

అన్నపూర్ణలో 3.38 టీఎంసీలు

ఇల్లంతకుంట(మానకొండూర్): అనంతగిరి అన్నపూర్ణ జలాశయం సామర్థ్యం 3.5 టీఎంసీలు కాగా ప్రస్తుతం 3.38 టీఎంసీలకు చేరింది. ఎత్తిపోతలు నిలిపివేసినట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు.

‘ఉపాధి’ పారదర్శకం

- జియో ఫెన్సింగ్‌తో కూలీల హాజరు
- పనుల గుర్తింపు సైతం
- ఉపాధిహామీ జాబ్‌కార్డులు 98వేలు
- గుర్తించిన పనులు 23వేలు



ముస్తాబాద్‌లో పనులను జియో ఫెన్సింగ్ చేస్తున్న టీఏ రమేశ్



ఉపాధిహామీ పనుల్లో కూలీలు

ముస్తాబాద్(సిరిసిల్ల): జాతీయ ఉపాధిహామీ పనుల్లో పారదర్శకతకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటి వరకు జియో ట్యాగింగ్ ద్వారా కూలీల హాజరు నమోదు చేసిన అధికారులు ఇక నుంచి జియో ఫెన్సింగ్ ద్వారా పనులు, హాజరును నమోదు చేయనున్నారు. పనికి ముందు, తరువాత చేసిన పనులే కాదు.. కూలీల హాజరు నమోదును మూడుసార్లు చేసేందుకు జియో ఫెన్సింగ్‌ను ఉపయోగిస్తారు. ఈమేరకు టెక్నికల్ అసిస్టెంట్లకు ప్రభుత్వం ఇప్పటికే శిక్షణను ఇచ్చింది. జియో ఫెన్సింగ్ విధానంపై పక్షం రోజుల క్రితమే శిక్షణ తరగతులు నిర్వహించారు. అక్టోబర్ నుంచి చేపట్టబోయే కొత్త పనులను జియో ఫెన్సింగ్ చేయనున్నారు. జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరం రూ.21.78 కోట్ల విలువైన ఉపాధిహామీ పనులు చేపడుతున్నారు.

ఏమిటీ జియో ఫెన్సింగ్

ఉపాధిహామీ గ్రామసభల్లో తీర్మానం చేసి గుర్తించిన పనులకు అధికారులు, సిబ్బంది ప్రతిపాదనలు చేస్తారు. పనుల మంజూరుకు ముందే టెక్నికల్ అసిస్టెంట్లు గుర్తించిన పనులకు జియోఫెన్సింగ్ చేస్తారు. ప్రత్యేక యాప్ ద్వారా పని ప్రదేశంలో జియోఫెన్సింగ్‌కు సరిహద్దులు నిర్ణయిస్తారు. గుర్తించిన పనిని నాలుగు వైపుల నుంచి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. పనికి ముందు.. పనికి మధ్యలో.. పని తరువాత.. జియో ఫెన్సింగ్ చేసి కూలీల నమోదు చేసి అప్‌లోడ్ చేస్తారు. గతంలో కూలీలు పనులు మొదలుపెట్టిన చోట నమోదైన ఫొటోతోపాటు గుర్తించిన పనిలో సరిహద్దులు దాటకుండా పని చేయాలి. ఫీల్డ్ అసిస్టెంట్లు, టీఏలు పనిప్రదేశంలో జియో ఫెన్సింగ్ ద్వారా గుర్తించి కూలీలకు పనులు అప్పగిస్తారు. దాని ప్రకారమే పనులు చేస్తారు. కూలీల హాజరు నమోదులో సులభతరం చేయడంతోపాటు పారదర్శకంగా పనులు జరిగేలా జియోఫెన్సింగ్ విధానం ఉపయోగపడుతుంది. కూలీలు పనులు చేసుకుంటూ కిలోమీటర్ల పరిధిలో నడిచి వెళ్తారు. పనులు పూర్తయిన తర్వాత మొదట ఫొటో దిగిన పని ప్రదేశానికి సదరు కూలీ రావాల్సి ఉంటుంది. దీంతో ఫీల్డ్ అసిస్టెంట్లు, కూలీలు ఇబ్బందులు పడేవారు. జియో ఫెన్సింగ్‌తో పని ప్రదేశంలో ఎక్కడ ఉన్న కూలీల హాజరును ఆన్‌లైన్ చేయవచ్చు.

ఉపాధిహామీ ఇలా..

జాబ్‌కార్డులు	98వేలు
యాక్టివ్ జాబ్‌కార్డులు	61వేలు
గుర్తించిన కూలీలు	2 లక్షలు
యాక్టివ్ వర్కర్లు	93వేలు
గుర్తించిన పనులు	23వేలు
కేటాయించిన బడ్జెట్	రూ.21.78 కోట్లు

ఒకసారి ఒకే పని

జియోఫెన్సింగ్ ద్వారా ఒకసారి చేపట్టిన పనిని మరోసారి చేపట్టరాదు. ఇప్పటి వరకు ఇలా అనేక చెరువులు, కుంటలు, కెనాల్స్‌ను పదుల సార్లు చేశారు. ఒకసారి జియోఫెన్సింగ్‌లో నమోదైన పనిని తిరిగి చేపట్టేందుకు వీలుకాదు. జియోఫెన్సింగ్ ద్వారా గుర్తించిన పనిప్రదేశంలో నాలుగు వైపులా నుంచి ఎక్కడి నుంచైన కూలీ హాజరును నమోదు చేయవచ్చు. జియో ట్యాగింగ్ ద్వారా గతంలో ఒక మూలనే కూలీ హాజరును తీసుకునేవారు. అయితే సెల్‌ఫోన్ నెట్‌వర్క్ లేనిచోట సాంకేతిక సమస్యలు వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఒక రోజు మొబైల్ పనిచేయకుంటే ఆరోజు హాజరు నమోదుకాదు. దీని ద్వారా కూలీలు నష్టపోయే ప్రమాదం ఉంది.

కొత్త పనులకు జియోఫెన్సింగ్



జియోఫెన్సింగ్ విధానంపై టెక్నికల్ అసిస్టెంట్లు శిక్షణ పొంది ఉన్నారు. కూలీల హాజరు దీని ద్వారా సులభతరం అవుతుంది. అలాగే జియో ఫెన్సింగ్ ద్వారా పనులు పారదర్శకంగా జరుగుతాయి. పనికి ముందు, మధ్యలో తరువాత చేసే పనులు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదవుతాయి. పరిధి దాటి చేసే పనులకు గుర్తింపు ఉండదు. జియో ఫెన్సింగ్‌తో కొత్త పనులు వేగవంతమవుతాయి.

– ఆనంద్ మోహన్, ఏపీవో

ఇలాగైతే ఆడేదెలా ?

- ఏళ్లుగా కొనసాగుతున్న మినీస్టేడియం పనులు
- త్వరగా పూర్తిచేయాలంటున్న క్రీడాకారులు



తిప్పాపూర్‌లో పూర్తికాని మినీ స్టేడియం

వేములవాడఅర్బన్: గ్రామీణ ప్రాంతంలోని క్రీడాకారుల్లో నైపుణ్యం పెంపు.. వారి టాలెంట్‌ను గుర్తించేందుకు చేపట్టిన మినీ స్టేడియం పనులు ఏళ్లుగా కొనసాగుతూనే ఉన్నాయి. ఆటలు ఆడేందుకు కనీస సౌకర్యాలు లేక క్రీడాకారులు ఇబ్బంది పడుతున్నారు. వేములవాడలో 2014లో ప్రారంభించిన మినీస్టేడియం పనులు ఇంకా పూర్తికాలేదు. ఫలితంగా క్రీడాకారులకు మౌలిక వసతులు దరిచేరడం లేదు.

రూ.2.10కోట్లతో 2014లో..

వేములవాడ మున్సిపల్ పరిధి నాంపల్లి శివారులో 5 ఎకరాల విస్తీర్ణంలో 13 జూలై 2014న అప్పటి ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు, అప్పటి స్పీకర్ మధుసూదనాచారి చేతుల మీదుగా రూ.2.10కోట్లతో మినీస్టేడియం పనులు ప్రారంభించారు. సగం పనులు చేసిన కాంట్రాక్టర్ తర్వాత పట్టించుకోలేదు. రెండేళ్ల క్రితం మళ్లీ రూ.5కోట్లు మంజూరు కావడంతో మళ్లీ కొంత మేరకు పనులు చేసి నిలిపివేశారు. ఇటీవల మళ్లీ పనులు ప్రారంభించారు.

చేయాల్సిన పనులు ఇవే..

మినీస్టేడియంలో క్రీడాకారుల కోసం ఆట స్థలం, ఆటలపోటీలను చూసేందుకు హాల్, ఇండోర్ స్టేడియం, సిబ్బంది కార్యాలయాలు, క్రీడాకారులకు స్నాన గదులు నిర్మించాల్సి ఉంది.

స్టేడియం పనులు పూర్తి చేయాలి



మినీస్టేడియం పనులు ఏళ్లుగా చేస్తూనే ఉన్నారు. మధ్య..మధ్యలో చేస్తూ నిలిపివేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు పనులు పూర్తయ్యేలా చూడాలి. – శ్రీకాంత్, క్రీడాకారుడు, తిప్పాపూర్

త్వరలోనే పూర్తవుతాయి

మినీస్టేడియం పనులు గతంలో జరిగి మధ్యలోనే ఆగిపోయాయి. ఇటీవల పనులు ప్రారంభమయ్యాయి. త్వరగా పూర్తయ్యేలా చూస్తాం. త్వరలోనే మినీ స్టేడియం క్రీడాకారులకు అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకుంటాం.

– శ్రీకాంత్, టీఎస్‌ఈడబ్ల్యుఐడీసీ, ఏఈ

ధాన్యం దళారుల పాలు

- పల్లెల్లోకి ప్రైవేట్ వ్యాపారులు
- ప్రారంభంకాని కొనుగోలు కేంద్రాలు
- మద్దతు ధర కోల్పోతున్న రైతులు



పెద్దలింగాపూర్‌లో ధాన్యం కొంటున్న వ్యాపారి

ఇల్లంతకుంట(మానకొండూర్): ప్రభుత్వం ఈ ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడంతో ఇప్పటికే చేతికొచ్చిన ధాన్యాన్ని రైతులు ప్రైవేట్ వ్యాపారులకు విక్రయిస్తున్నారు. వరుసగా కురుస్తున్న వర్షాలకు ధాన్యం తడిస్తే రంగుమారుతుందనే భయంతో అన్నదాతలు సైతం వ్యాపారులు ఎంత ధర చెబితే అంతకే అమ్మేస్తున్నారు. ఇల్లంతకుంట మండలంలో ఈ ఖరీఫ్ సీజన్‌లో దాదాపు 25వేల ఎకరాల వరకు వరి సాగుచేశారు. మొదట సాగుచేసిన వరి పంటలు కోతకొచ్చాయి. పెద్దలింగాపూర్ ప్రాంతంలో చాలా మటుకు పంట కోతకొచ్చింది. గత వారం రోజులుగా పంటను కోస్తున్న రైతులు వర్షం కురుస్తుండడంతో భయాందోళన చెందుతున్నారు. ఒక్క పెద్దలింగాపూర్ గ్రామంలోనే ప్రైవేట్ వ్యాపారులు ఇప్పటి వరకు ఐదు లారీల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిసింది. పచ్చి వడ్లను క్వింటాల్‌కు రూ.1700 దళారులు కొనుగోలు చేస్తున్నారు. బస్తాకు రెండు కిలోల తరుగు తీస్తున్నారని రైతులు తెలిపారు. గత రబీ సీజన్‌లో ఇల్లంతకుంట మండలంలో 28 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు ఒక్క కేంద్రాన్ని కూడా ప్రారంభించలేదు. దీంతో చేసేదేమి లేక రైతులు ప్రైవేట్ వ్యాపారులకే విక్రయిస్తున్నారు.

మిల్లర్లు నిబంధనలు పాటించాలి

- కలెక్టర్ హరిత



మాట్లాడుతున్న కలెక్టర్ హరిత

సిరిసిల్ల: జిల్లాలోని రైస్‌మిల్లర్లు నిబంధనలు పాటించాలని కలెక్టర్ ఎం.హరిత కోరారు. కలెక్టరేట్‌లో సోమవారం జిల్లాలో వరి ధాన్యం సేకరణ, బ్యాంక్ గ్యారెంటీ, సీఎమ్మార్ సరఫరాపై రైస్‌మిల్లర్లతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ రైస్‌మిల్లర్లు సీఎమ్మార్ సరఫరా చేయాలని, గత ఖరీఫ్‌లో జిల్లాలో 2.15 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని తెలిపారు. ఈనెల మూడో వారంలో జిల్లాలో వరికోతలు మొదలు కానున్నాయని, ఈ సీజన్‌లో దాదాపు 2.70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి రానుందని అంచనా ఉన్నట్లు తెలిపారు. నిబంధనల ప్రకారం రైస్‌మిల్లర్లు బ్యాంక్ గ్యారెంటీ ఇవ్వాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పలువురు రైస్‌మిల్లర్లు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఎఫ్‌సీఐకి బియ్యం ఇచ్చేందుకు బెడ్స్ ఇప్పించాలని విన్నవించగా.. నిబంధనల ప్రకారం మిల్లర్లకు సహకరిస్తామని కలెక్టర్ తెలిపారు. అదనపు కలెక్టర్ గడ్డం నగేశ్, జిల్లా పౌరసరఫరాల అధికారి చంద్రప్రకాశ్, డీఎం రజిత, జిల్లా రైస్‌మిల్లర్ల సంఘం ప్రతినిధులు చేపూరి నాగరాజు, పబ్బ నాగరాజు, గరిపెల్లి ప్రభాకర్ పాల్గొన్నారు.

గ్రీన్‌ఫీల్డ్ కారిడార్ అభివృద్ధిపై కాన్ఫరెన్స్

గ్రీన్‌ఫీల్డ్ నాగ్‌పూర్–హైదరాబాద్ హైస్పీడ్ కారిడార్ అభివృద్ధిపై రోడ్లు భవనాల శాఖ చీఫ్ సెక్రటరీ వికాస్‌రాజ్ సోమవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రీన్‌ఫీల్డ్ రోడ్డుకు డీపీఆర్‌కు సహకరించాలని కోరారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఎం.హరిత, కలెక్టరేట్ పర్యవేక్షకులు శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

- ఏడాది పొడవునా పని ఉండేలా చూడండి..
- వస్త్రోత్పత్తిదారుల ‘కరెంట్’ సమస్యను పరిష్కరించండి
- మంత్రి సీతక్కకు వెల్లువలా వినతులు



ఇందిరా మహిళాశక్తి చీరలను పరిశీలిస్తున్న మంత్రి సీతక్క, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జౌళిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్, కాంగ్రెస్ నాయకుడు కేకే మహేందర్‌రెడ్డి

సిరిసిల్ల: నేతన్నలకు ఏడాది పొడవునా చేతినిండా పని ఉండేలా చూడాలని కొందరు.. ప్రభుత్వ ఆర్డర్లతోనే మేలైనా కూలీ వస్తోందని.. మరిన్ని ఆర్డర్లు ఇవ్వాలని మరికొందరు.. వస్త్రోత్పదారులపై విధిస్తున్న విద్యుత్ బిల్లులు మాఫీ చేయాలని మరికొందరు.. ఇలా మంత్రి సీతక్కకు వినతులు వెల్లువలా వచ్చాయి. సిరిసిల్లలో తొలిసారి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశుసంక్షేమశాఖ మంత్రి సీతక్క సోమవారం పర్యటించారు. వెంకట్రావునగర్‌లోని పవర్‌లూమ్ కార్ఖానా నుంచి, ఇందిరానగర్‌లోని చీరల బట్టను సేకరించే గోదాం, ప్రాసెసింగ్ యూనిట్ వరకు వస్త్రోత్పత్తిలోని వివిధ దశలను పరిశీలించారు. నేతకార్మికులు, వైపని కార్మికులు, ఆసాములు, వస్త్రోత్పత్తిదారులతో మాట్లాడారు. మంత్రి హోదాలో తొలిసారి జిల్లాకు వచ్చిన సీతక్కకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, చేనేత, జౌళిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్, కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కె.కె.మహేందర్‌రెడ్డి, ఏఎంసీ చైర్‌పర్సన్ వెల్ముల స్వరూపారెడ్డి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో చొప్పదండి ప్రకాశ్, సంగీతం శ్రీనివాస్, ఆకునూరి బాలరాజు, సూర దేవరాజు, గడ్డం నర్సయ్య, వైద్య శివప్రసాద్, గౌతమ్, రెడ్డినాయక్, ఆడెపు చంద్రకళ, మడుపు శ్రీదేవి, కల్లూరి చందన, గోనె శరణ్య జౌళిశాఖ జేడీ ఎన్.వెంకటేశ్వర్‌రావు, వస్త్రోత్పత్తిదారులు గోవిందు రవి, ఆడెపు భాస్కర్, వెల్దండి దేవదాస్, అన్నల్‌దాస్ అనిల్‌కుమార్, తాటిపాముల దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

నేతకళాకారుడికి సన్మానం

చేనేత శిల్పి నల్ల పరంధాములు తనయుడు నల్ల శ్రావణ్‌ను మంత్రి సీతక్క శాలువాతో సన్మానించారు. సీఎం రేవంత్‌రెడ్డి ముఖచిత్రాన్ని అగ్గిపెట్టెలో పట్టే శాలువాపై నేసారు.

కరెంట్ సమస్యను పరిష్కరించండి


చిన్నతరహా పరిశ్రమల పేరిట బ్యాక్ బిల్లింగ్ అని ‘సెస్’ అధికారులు కోర్టు ఆదేశాలను సాకుగా చూపి రూ.కోట్ల కరెంట్ బిల్లులు వేశారని మంత్రికి వస్త్రోత్పత్తిదారులు వివరించారు. బీఆర్‌ఎస్‌కు చెందిన ‘సెస్’ చైర్మన్ తమపై కక్ష గట్టి వేధిస్తున్నాడని, బ్యాక్ బిల్లింగ్ సమస్యను పరిష్కరించాలని విన్నవించారు. పట్టణంలోని బీ.వై.నగర్‌లో అందరికీ అందుబాటులో ఉన్న చేనేత, జౌళిశాఖ ఆఫీస్‌ను రగుడు శివారులోని కలెక్టరేట్‌కు మార్చారని, దాన్ని గతంలో కొనసాగించిన భవనంలోకి తరలించాలని పాలిస్టర్ అసోసియేషన్ ప్రతినిధులు వినతిపత్రం అందించారు. సిరిసిల్ల మహిళాభివృద్ధి, శిశుసంక్షేమశాఖలో పనిచేసే ఒప్పంద ఉద్యోగులను అకారణంగా విధుల నుంచి తప్పించారని, తిరిగి ఉద్యోగాల్లోకి తీసుకోవాలని కోరుతూ ఆయా సంస్థల్లో పనిచేసిన మాజీ ఉద్యోగులు మంత్రికి వినతిపత్రం అందించారు.



మంత్రి సీతక్కను సన్మానిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కేకే మహేందర్‌రెడ్డి

నేతకార్మికులకు యారన్ సబ్సిడీ ఇవ్వండి

- చేనేత, జౌళిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్‌కు విన్నపం



శైలజారామయ్యర్‌కు విన్నవిస్తున్న కార్మికనేతలు

సిరిసిల్లటౌన్: ఇందిరా మహిళాశక్తి చీరలకు సంబంధించిన పవర్‌లూమ్స్, అనుబంధ రంగాల కార్మికులకు 10 శాతం యారన్ సబ్సిడీ అందించాలని పవర్‌లూమ్స్ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మూశం రమేశ్ కోరారు. సిరిసిల్లలో సోమవారం పర్యటించిన చేనేత, జౌళిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్‌కు వినతిపత్రం అందించి మాట్లాడారు. మొదటి విడత ఆర్డర్ పూర్తికావస్తున్నందున కార్మికుల ఉపాధికి ఇబ్బంది కలగకుండా రెండో విడత ఆర్డర్‌ను అందించాలని కోరారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కోడం రమణ, పట్టణ అధ్యక్షులు నక్క దేవదాస్, అక్తర్ అన్సారి పాల్గొన్నారు.



కాళింగమర్దనంపై విహరిస్తున్న శ్రీవారు



పొన్నసేవపై విహరిస్తున్న శ్రీవారిని దర్శించుకుంటున్న భక్తులు

పొన్నరథంపై గోవిందుడు

- తిరువీధుల్లో తిలకించిన భక్తజనం
- మిన్నంటిన గోవింద నామస్మరణం

సిరిసిల్లటౌన్: అశేష భక్తుల గోవిందనామస్మరణతో శ్రీశాల తిరువీధులు పులకించాయి. ఎనిమిది రోజులుగా సాగుతున్న శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి పొన్నరథోత్సవం జరిగింది. తిరుమలేశుని అనుబంధ ఆలయమైన సిరిసిల్ల తిరువీధుల్లో గోవిందుని రూపంలో శ్రీవారు పొన్నరథంపై విహరించారు. ఈసందర్భంగా సాయంత్రం 6గంటల నుంచే పొన్నవాహన ఉత్సవాలు నిర్వహించారు. కళాకారుల కోలాటాలు, భజన సంకీర్తనలతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. రాత్రి 9 గంటలకు ప్రారంభమైన పొన్నరథాన్ని లాగడానికి భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. టీపీసీసీ కోఆర్డినేటర్ సంగీతం శ్రీనివాస్, ఈవో మారుతిరావు, ఏఈవోలు కూనబోయిన సత్యం, పీసరి రవీందర్, ఆలయ కమిటీ మాజీ చైర్మన్లు ఉప్పుల విఠల్‌రెడ్డి, చేపూరి నాగరాజు, తీగల శేఖర్‌గౌడ్, అర్చకస్వాములు కృష్ణమాచారి తదితరులు పాల్గొన్నారు.

కాళింగమర్దనంపై దేవదేవుడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం 11 గంటలకు కాళింగమర్దన సేవ నిర్వహించారు. గోవిందా నామస్మరణతో మాడవీధులు పులకించిపోయాయి. కాళింగమర్దనంపై విచ్చేసిన దేవదేవుడికి భక్తులు మంగళహారతులతో నీరాజనం పలికారు.

భక్తిశ్రద్ధలతో కోజాగరి వ్రతం



కౌముది పూజ నిర్వహిస్తున్న అర్చకులు

వేములవాడ: ఏడాదికోమారు వచ్చే అశ్వయుజ శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకొని వేములవాడ రాజన్న ఆలయంలో సోమవారం రాత్రి కౌముదిపూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. లక్ష్మీదేవి, ఇంద్రుడు, చంద్రుడిని భక్తులు పూజించారు. ఆలయంలో ఓ భారీ తాంబూలంలో నిండుగా పాలుపోసి అందులో చంద్రుడిని దర్శించుకున్నారు. ఈవో రమాదేవి, అర్చకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బావిలోపడి వృద్ధురాలి మృతి

పాలకుర్తి(రామగుండం): పుట్నూర్ గ్రామంలో అష్టకల శాంతమ్మ(90) సోమవారం బావిలోప డి మృతిచెందింది. స్థానికులు, పోలీసుల కథ నం ప్రకారం.. శాంతమ్మ తన చిన్న కుమారుడు మధుకర్ ఇంట్లో ఉంటోంది. రోజూ మాదిరిగానే అందరూ నిద్రకు ఉపక్రమించారు. తెల్లవారు జామున లేచి చూసేసరికి కనిపించలేదు. తన ఇంటిసమీపంలోని సోదరుడు రవి ఇంటికి వెళ్లిఉంటుందని భావించారు. అక్కడా కనిపించలేదు. దీంతో పరిసరాల్లో వెతుకుతుండగా చేదబావి వద్ద శాంతమ్మ చేతికర్ర కనిపించింది. అనుమానంతో అందులో చూడగా మృతదేహం కనిపించింది. రాత్రివేళలో బహిర్భూమికి వెళ్లేందుకు యత్నించిన శాంతమ్మ.. ప్రమాదవశాత్తు బావి లో పడి ఉంటుందని అనుమానం వ్యక్తం చేస్తు న్నారు. ఈ మేరకు ఎస్సై స్వామి కేసు నమోదు చేసుకున్నారు. అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీ కాంట్రాక్ట్ కార్మిక సంఘం అధ్యక్షుడు కౌశిక హరి.. శాంతమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

రిటైర్డ్ ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్య

వీణవంక: మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన రిటైర్డ్ ఆర్టీసీ డ్రైవర్ పంజాల మల్లయ్య(67) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. ఇరవై ఏళ్లుగా షుగర్ వ్యాధితో బాధపడుతూ ఆసుపత్రుల చుట్టూ తిరిగినా వ్యాధి నయం కాలేదు. ఇన్‌ఫెక్షన్‌తో కుడికాలు తీసివేయాలని వైద్యులు సూచించడంతో జీవితంపై విరక్తి చెంది సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. మృతుడి కుమారుడు శ్రీనివాస్ ఫిర్యాదుతో కేసుదర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ఆవుల తిరుపతి తెలిపారు.

ఉరేసుకొని వ్యక్తి..

కరీంనగర్‌క్రైం: కరీంనగర్‌లోని బుట్టిరాజ రాంకాలనీకి చెందిన శ్రీనివాస్ ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెయింటర్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్‌కు భార్య, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. ప్రతిరోజూ మద్యం తాగి ఇంటికి వచ్చేవాడు. ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్నం మద్యం సేవించి ఇంటికి వచ్చి నిద్రపోతానని చెప్పి బెడ్రూం గడియపెట్టుకున్నాడు. సాయంత్రం ఎంతపిలిచినా లేవకపోవడంతో అతని భార్య స్వప్న తన మరిది శ్రీకాంత్‌కు సమాచారం ఇవ్వడంతో అతను వచ్చి తలుపు గడియ తెరిచి చూసేసరికి ఉరేసుకొని కనిపించాడు. ఈమేరకు మృతుడి భార్య సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ మృతి

శంకరపట్నం: మండలంలోని ముత్తారం గ్రామానికి చెందిన యువకుడు కటికరెడ్డి సుమంత్(24) చికిత్స పొందుతూ మృతిచెందాడని ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు. మద్యానికి బానిసైన సుమంత్ బైక్ ఈఎంఐ చెల్లించలేక ఆదివారం గడ్డి మందు తాగాడు. కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడని, సుమంత్ పెద్దనాన్న సంపత్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

తల్వార్‌తో విన్యాసాలు చేసిన వ్యక్తిపై కేసు

వెల్గటూర్/పాలకుర్తి : అమ్మవారి ఊరేగింపులో తల్వార్‌తో విన్యాసాలు చేసిన వ్యక్తిపై కేసు న మోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు బసంత్‌నగర్ ఎస్సై స్వామి తెలిపారు. ఈనెల 3న ముంజంపల్లిలో అమ్మవారి ఊరేగింపు చేపడుతుండగా.. బైరం హరీశ్ తల్వార్ తీసుకొచ్చి విన్యాసాలు చేసి అక్కడున్నవారిని భయభ్రాంతులకు గురిచేశాడు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు హరీ శ్‌పై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

స్థానికంలో కాసుల గోల

- పెళ్లిళ్ల సీజన్.. బ్రాందీ షాపుల టెండర్లు
- రూ.50వేలకుపైగా ఉంటే సీజ్ చేస్తున్న పోలీసులు

స్వాధీనం చేసుకున్న సొత్తు	
మంచిర్యాల జిల్లా:	
నగదు	రూ.4.48లక్షలు
లిక్కర్	146లీటర్లు(రూ.65వేలు)
పెద్దపల్లి జిల్లా:	
లిక్కర్	48లీటర్లు(రూ.17వేలు)
గంజాయి	5కిలోలు(రూ.1.25లక్షలు)
పీడీఎస్‌రైస్	క్వింటాల్


బస్సులో తనిఖీ చేస్తున్న పోలీసులు

గోదావరిఖని: స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ వెలువడటంతో పోలీసులు అప్రమత్తమైయ్యారు. రాష్ట్ర, జిల్లా సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. ప్రధాన కూడళ్లలో పోలీసు బలగాలను మోహరించారు. నగదు ప్రవాహంపై దృష్టి సారించారు. రూ.50వేల కన్నా ఎక్కువ వెంట తీసుకెళ్తే కచ్చితమైన ఆధారాలు చూపించాల్సిందేనని స్పష్టం చేస్తున్నారు. లేకుంటే సీజ్ చేస్తామంటున్నారు. ఇదే క్రమంలో ఈనెల 4న రామగుండం పోలీస్ కమిషనరేట్ కోటపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని అంతర్ రాష్ట్ర సరిహద్దు పారుపల్లి చెక్‌పోస్టు వద్ద రూ.1.90లక్షలను సీజ్ చేశారు. మహారాష్ట్రలో ఎన్నికలు లేకపోవడంతో కోడ్ విషయం తెలియక కారులో ఓ వ్యక్తి నగదు తీసుకెళ్తున్నాడు. రూ.50వేల కన్నా ఎక్కువ తీసుకెళ్తుండడంతో సీజ్ చేశారు. ఇలాంటి సంఘటనలు రాష్ట్రంలో చాలాజరుగుతున్నాయి.

పెళ్లిళ్ల సీజన్ కావడంతో ఆందోళన..

పెళ్లిళ్ల సీజన్ కావడంతో బంగారం, వెండి, ఇతర విలువైన ఆభరణాల కొనుగోలు కోసం పెద్దమొత్తంలో నగదు అవసరం ఉంటుంది. పది గ్రాముల బంగారం కొనుగోలు చేయాలన్నా కనీసం రూ.1.20లక్షలు అవసరం అవుతోంది. ఈక్రమంలో నగదు వెంట తీసుకెళ్లడం తప్పనిసరి. కొంతమంది ఆన్‌లైన్ లావాదేవీల ద్వారా కొనుగోలు చేస్తున్నా.. చాలామంది నగదు రూపేణా లావాదేవీలు జరుపుతున్నారు. ఈక్రమంలో పోలీసులు అధిక డబ్బులు తీసుకెళ్తున్నారని సీజ్ చేస్తే తమ పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. అసలు ఎన్నికలకు సంబంధించిన డబ్బులు చాపకింద నీరులా వెళ్తాయని, ఎన్నికల కమిషన్ అతి నిబంధనలతో తాము ఇబ్బందిపడాల్సి వస్తోందని సామాన్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బ్రాందీ షాపుల టెండర్లు..

రాష్ట్రప్రభుత్వం బ్రాందీషాపుల టెండర్లను ప్రారంభించింది. రెండేళ్ల కాలపరిమితికి ఒక్కోషాపు వేలంలో పాల్గొనేందుకు రూ.3లక్షలు చెల్లించి డీడీ తీయాలని సూచించింది. దీంతో చాలామంది టెండర్లలో పాల్గొనేందుకు నగదు వెంట తీసుకెళ్లడం సహజం. స్థానిక ఎన్నికల కోడ్ కూసిన క్రమంలో తమ పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఈక్రమంలో పట్టణాల్లో మినహాయించి స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతున్న ప్రాంతాల్లో ఈనిబంధన ఉండాలని కోరుతున్నారు.

చెక్‌పోస్టులు:

మంచిర్యాల జిల్లా:
పారుపల్లి(అంతర్‌రాష్ట్ర), ఇందన్‌పల్లి, ఇందారం, తాండూర్, గూడెం

పెద్దపల్లి జిల్లా:
దుబ్బపల్లి, గుంపుల, ఎక్లాస్‌పూర్, గోదావరి బ్రిడ్జి

నిబంధనలు పాటిస్తాం



ఎన్నికల నిబంధనల మేరకు వ్యవహరిస్తాం. నిబంధనలు అతిక్రమించి రూ.50వేలకుపైగా వెంట తీసుకెళ్తే అందుకు తగిన ఆధారాలు చూపించాల్సి ఉంటుంది. లేకుంటే రూ.50వేల కన్నా ఎక్కువ ఉన్నసొమ్మును సీజ్ చేస్తాం. జిల్లా సరిహద్దులతో పాటు అంతర్ రాష్ట్ర సరిహద్దు అయిన కోటపల్లి మండలం శివారులోని మహారాష్ట్ర బ్రిడ్జి వద్ద చెక్ పోస్టు ఏర్పాటు చేశాం. నగదు, మద్యం రవాణాపై ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నాం.

– అంబర్ కిశోర్ ఝా, పోలీస్ కమిషనర్, రామగుండం

స్థానిక ఎన్నికల్లో పొత్తు ఉండదు



మాట్లాడుతున్న యాసర్ అర్ఫాత్

విద్యానగర్(కరీంనగర్): ఎంఐఎం పార్టీ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏ పార్టీతో పొత్తు పెట్టుకోదని ఎంఐఎం కరీంనగర్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి యాసర్ అర్ఫాత్ స్పష్టం చేశారు. సోమవారం రాత్రి కరీంనగర్‌లోని ఎంఐఎం పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తల సమావేశం జరిగింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ పార్టీ ఒంటరిగా పోటీ చేస్తుందని, పార్టీ అభ్యర్థుల విజయానికి అందరూ కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. కరీంనగర్ అధ్యక్షుడు గులాం అహ్మద్ హుస్సేన్, జీహెచ్ఎంసీ మాజీ కార్పొరేటర్ సుబహాన్, నాయకులు బర్కత్ అలీ, హాఫిజ్ యూసుఫ్, ఖమరొద్దీన్, ఆతిన, ఖాజా, ఇబ్రహీం, మాజీ కార్పొరేటర్లు అఖీల్ ఫిరోజ్, శర్ఫుద్దీన్, ఆరిఫ్ అహ్మద్, మాజిద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్‌కు ఒడిశా పోలీసులు

కరీంనగర్‌క్రైం: సైబర్ క్రైం కేసులో ఒడిశా రాష్ట్రానికి చెందిన పోలీసులు సోమవారం కరీంనగర్‌కు వచ్చినట్లు తెలిసింది. కరీంనగర్ టూటౌన్ పరిధికి చెందిన కార్తీక్ అనే వ్యక్తి పాత్ర ఉందని భావించి అతను ఉంటున్న విద్యానగర్ ప్రాంతంలో దర్యాప్తు చేశారు. సైబర్ నేరస్తులు సామాన్యులకు కొంతడబ్బు ఇచ్చి వారి పేర్లపై ఖాతాలు తెరుస్తుండటంతో ఇలాంటి నేరంతో సంబంధాలు ఉన్నాయని అనుమానిస్తున్న పోలీసులు అతడిని అక్కడికి తీసుకెళ్లినట్లు సమాచారం.

కుక్కల దాడిలో మహిళలకు తీవ్ర గాయాలు


మహిళ తలపై గాయం

మేడిపల్లి: భీమారం మండలం మన్నెగూడెంలో వాసం గంగు ఉదయం ఇంటి పనులు చేస్తుండగా.. ఓ కుక్క విచక్షణారహితంగా దాడి చేయడంతో ఆమె తలపై తీవ్రగాయాలయ్యాయి. ఆమెను వెంటనే జగిత్యాల ఆస్పత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు. మేడిపల్లి, భీమారం మండలాల్లో కుక్కల బెడద తీవ్రంగా ఉందని, అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

విద్యుత్ లైన్ ఇన్‌స్పెక్టర్ సస్పెన్షన్

- జగ్గాసాగర్ సబ్‌స్టేషన్ ఆపరేటర్‌పై దాడి ఘటనలో..

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం జగ్గాసాగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ ఆపరేటర్ సదానందంపై దాడి చేసిన ఘటనలో ఉన్నతాధికారులు శాఖాపరమైన చర్యలు చేపట్టారు. బతుకమ్మ నిమజ్జనం సందర్భంగా త్రీఫేజ్ సరఫరా చేయాలని మెట్‌పల్లి రూరల్ సెక్షన్ లైన్ ఇన్‌స్పెక్టర్ వినోద్ సదానందంకు సూచించగా.. ఉన్నతాధికారుల అనుమతి తీసుకుంటానని చెప్పడంతో ఇద్దరి మధ్య ఫోన్‌లో వాగ్వాదం జరిగి దాడి వరకు వెళ్లిన విషయం తెల్సిందే. దీంతో బాధితుడు సదానందం అదేరోజు పైఅధికారులతోపాటు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విచారణ జరిపిన మెట్‌పల్లి ఏడీ అమరేందర్, ఏఈ రమేశ్ ఉన్నతాధికారులకు నివేదించారు. వారిచ్చిన నివేదిక ఆధారంగా లైన్‌ఇన్‌స్పెక్టర్ వినోద్‌ను సస్పెండ్ చేశారు.

వేములవాడలో కొండచిలువ


కొండచిలువను పట్టుకున్న జగదీశ్

వేములవాడ పట్టణ శివారులోని మూలవాగు తీరంలో ధోబీఘాట్ వద్ద 9 ఫీట్ల పొడవు ఉన్న కొండచిలువ సోమవారం కనిపించింది. దీన్ని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. ట్రాఫిక్ ఎస్సై రాజు అక్కడికి చేరుకుని పాములు పట్టే జగదీశ్‌కు సమాచారం ఇవ్వడంతో అతను వచ్చి కొండచిలువను పట్టుకొని అటవీప్రాంతంలో వదిలిపెట్టారు. – వేములవాడ




రాజన్నకు అభిషేకాలు

వేములవాడ: రాజన్నను సోమవారం వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. గర్భగుడి దర్శనాలు రద్దుచేసిన ఆలయ అధికారులు భక్తుల సౌకర్యార్థం ఈ సోమవారం అభిషేకాలు, అన్నపూజ, ఆకులపూజలకు అనుమతినిచ్చారు. రాజన్నను నిజామాబాద్ జిల్లాకు చెందిన అంతర్జాతీయ హకీ ప్లేయర్ ఎండాల సౌందర్య దర్శించుకున్నారు. అర్చకులు స్వామి వారి ప్రసాదాలు అందించి సత్కరించారు. భక్తుల ఏర్పాట్లను ఈవో రమాదేవి, ఏఈవోలు, పర్యవేక్షకులు పరిశీలించారు.

'అడవిలో అన్నలు' సిరిసిల్లలో కలిశారు!


మంత్రి సీతక్కతో నాటి జనశక్తి దళానాయకులు సోమన్న, కుమార్

సిరిసిల్ల: సిరిసిల్లకు వచ్చిన మంత్రి సీతక్కను అప్పటి అన్నలు కలిశారు. ములుగు జిల్లాకు చెందిన ధనసరి అనసూర్య ఉరఫ్ సీతక్క 1985–92 ప్రాంతంలో సీపీఐ(ఎంఎల్) జనశక్తిలో దళనేతగా పనిచేశారు. అనంతరం ఆమె జనజీవన స్రవంతిలో కలిశారు. రాజకీయాల్లోకి వచ్చారు. ప్రస్తుతం మంత్రిగా పనిచేస్తున్నారు. వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు సోమవారం సిరిసిల్లకు వచ్చిన మంత్రిని జనశక్తి మాజీ నక్సల్స్ కోనరావుపేట మండలం వెంకట్రావుపేటకు చెందిన బుర్ర మల్లేశంగౌడ్ ఉరఫ్ కుమారన్న, ఇదే మండలంలోని మల్కాపేటకు చెందిన బుట్టం చంద్రయ్య ఉరఫ్ సోమన్న కలిశారు. గతంలో సీతక్కతో కలిసి పనిచేసిన సందర్భాన్ని గుర్తుచేసుకున్నారు. ఇది ఇలాఉంటే 1989లో గ్రెనేడ్ పేలి సోమన్న చేయి నుజ్జునుజ్జయ్యింది. అనంతరం వ్యక్తిగత కారణాలతో 1995లో ఆయన జనజీవన స్రవంతిలో కలిశారు. మరో నాయకుడు కుమారన్న వరంగల్ జిల్లాలోనే ఎక్కువ కాలం పనిచేశారు. 1989లో జనజీవన స్రవంతిలో కలిశారు. ఆ తర్వాత జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ముష్టిపల్లి సర్పంచ్, ఉపసర్పంచగా పనిచేశారు.

ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందానికి సింగరేణి రెస్క్యూ శిక్షణ


రెస్క్యూ స్టేషన్ వద్ద ఎన్‌డీఆర్‌ఎఫ్ సభ్యులు, సింగరేణి అధికారులు

- మొదటి బ్యాచ్‌కు శిక్షణ ప్రారంభం

గోదావరిఖని: నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎన్‌డీఆర్‌ఎఫ్) సభ్యులకు సింగరేణి యాజమాన్యం సోమవారం శిక్షణ ప్రారంభించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్నాటక రాష్ట్రాల్లోని 10వ బెటాలియన్‌కు చెందిన మొదటి బ్యాచ్‌కు శిక్షణ ఇస్తున్నారు. భూగర్భగనుల్లో ప్రమాదాలు జరిగిన సమయంలో వ్యవహరించాల్సిన తీరుపై ఒక్కో బ్యాచ్‌కు 14రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. జాతీయ స్థాయిలో ప్రత్యేకతను సంతరించుకున్న సింగరేణి రెస్క్యూ ద్వారా ఎన్‌డీఆర్‌ఎఫ్‌కు శిక్షణ ఇవ్వాలని కేంద్ర ఎన్‌డీఆర్‌ఎఫ్, మినిస్టరీ ఆఫ్ హోం ఎఫైర్స్, డీజీఎంఎస్, సింగరేణి సంస్థ కలిపి ఈనిర్ణయం తీసుకున్నాయి. శ్రీశైలం ఎస్ఎల్‌బీసీ సంఘటన సమయంలో సింగరేణి రెస్క్యూ బృందాల పనితీరు దేశవ్యాప్తంగా తెరపైకి వచ్చింది. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో కూడా ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు పనిచేయాలనే ఆలోచనతో ఈశిక్షణకు అంకురార్పన జరిపారు. మొదటి బ్యాచ్‌లో 30మంది సభ్యులు ఉంటారని, ఈ బెటాలియన్‌లో 18 బ్యాచ్‌లు ఉంటాయని అసిస్టెంట్ కమాండర్ కె.కిరణ్‌కుమార్ తెలిపారు. ఈశిక్షణను ఆర్జీ–2 జీఎం బండి వెంకటయ్య, ఏరియా సేఫ్టీ జీఎం మధుసూదన్, రెస్క్యూ జీఎం శ్రీనివాస్‌రెడ్డి, సూపరింటెండెంట్ రాజేందర్‌రెడ్డి ప్రారంభించారు. 14రోజుల పాటు రెసిడెన్షియల్ శిక్షణ కొనసాగనుంది.

యువకుడిపై దాడి


గాయపడిన రాజశేఖర్

సిరిసిల్లక్రైం: రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రం వెంకంపేట ప్రాంతంలో సోమవారం పాతపగలతో జరిగిన దాడి ఉద్రిక్తతకు దారితీసింది. స్థానికులు తెలిపిన వివరాలు. వెంకంపేటకు చెందిన రాజశేఖర్‌పై అదే పట్టణానికి చెందిన హరికృష్ణ, విగ్నేశ్, నరేశ్‌లు కర్రలతో దాడి చేశారు. ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో దాడి చేయగా అడ్డుకునేందుకు ప్రయత్నించినా వినకుండా విచక్షణారహితంగా కర్రలతో కొట్టారు. తలపై గాయాలతో రక్తస్రావమైన రాజశేఖర్ వెంటనే హాస్పిటల్‌లో చికిత్స పొంది, స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఈ దాడితో బాధితుని ఉండే ఏరియాలో నివసించే వారు భయాందోళన చెందుతున్నారు. ఈ సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

పంటలకు తెగుళ్ల బెడద

- ఎడతెరిపిలేని భారీవర్షాలు కారణం
- కోతదశకు వచ్చిన వరిపైరు
- మొగ్గ, పగిలే దశలో పత్తిపంట
- దిగుబడిపై తీవ్రప్రభావం
- లబోదిబోమంటున్న రైతులు


ఓదెల : మడకలో పత్తికి సోకిన తెగులు


సుల్తానాబాద్: ఎర్రగా మారిన వరిపైరు కాండం

సుల్తానాబాద్/జూలపల్లి/ఓదెల(పెద్దపల్లి): కొద్దిరోజులుగా కురుస్తున్న భారీవర్షాలతో వరి, పత్తి పంటలకు తెగుళ్లు ఆశిస్తున్నాయి. వర్షాకాలం ఆరంభంలో ఆలస్యంగా కురిసిన వానలు.. ఇప్పుడు సీజన్ చివరిదశకు వచ్చినా భారీవర్షాలు కురుస్తుండడంతో పంటలు దెబ్బతింటున్నాయి. వీటికితోడు వాతావరణంలో ఆకస్మిక మార్పులతోనూ వరి, పత్తి పంటలకు వివిధ తెగుళ్లు ఆశిస్తున్నాయి. మరో నెలరోజుల్లో పంటలు చేతికి వస్తాయి. ఈ క్రమంలో తెగుళ్లు ఆశించడంతో దిగుబడిపై ప్రభావం పడుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. భారీవర్షాలతో వరి పంటను తెగుళ్లు ఆశిస్తున్నాయి. గింజదశలోని పంటను ఆశించడంతో దిగుబడి తగ్గుతుందని, అంతేకాకుండా తాలు అధికంగా ఉంటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అన్నదాతలను ముంచిన భారీ వర్షాలు

జూలపల్లి మండలంలోని కోనరావుపేట, నాగులపల్లె, కల్లెంరెడ్డిపల్లె, తెలుకుంట తదితర గ్రామాల్లోని వరిపంట కోతదశకు చేరింది. గింజగట్టిపడక ముందే ఏకధాటివానలతో తాలుగా మారే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాగులపల్లె, తెలుకుంట, కల్లెంరెడ్డిపల్లెలో వర్షం ధాటికి దాదాపు 30 ఎకరాల్లో వరిపైరు నేలవాలిందని, గింజలు పనికిరాకుండా పోయానని వాపోతున్నారు.

తెల్లబంగారానికి తెగులు..

ఓదెల మండలంలోని వివిధ గ్రామాల్లో పత్తి పంటకు తెగులు సోకింది. మచ్చతెగుళ్లతో పంట దెబ్బతింటోదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓదెల మండలంలోని 22 గ్రామాల్లో సుమారు 4 వేల ఎకరాల్లో పత్తి సాగు చేశారని అధికారుల అంచనా. ఇందుర్తిలో 250 ఎకరాలు, పొత్కపల్లిలో వెయ్యి , శానగొండలో 500, గుంపులలో 350, ఓదెలలో 570, కొమిరలో 320, కొలనూర్‌లో 200, మడకలో దాదాపు 250 ఎకరాల్లో పత్తి సాగైందని, కొద్దిరోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పంటకు నల్లమచ్చలు వస్తున్నాయని, మొక్కలు కుళ్లిపోతున్నాయని అన్నదాతల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పంట చేతికి వచ్చే దశలో ఉందని, ఈ సమయంలో కాయలు, బుగ్గలు నల్లగా మారడంతో దిగుబడి తగ్గుతుందని, పెట్టుబడి చేతికి వచ్చే పరిస్థితి లేదంటున్నారు. మరోవైపు.. చేను జాలువారి మొక్కలన్నీ ఎర్రబారుతున్నాయని అంటున్నారు.

ఏఈవోలను సంప్రదించాలి

కొద్దిరోజులుగా వరుసగా కురుస్తున్న వర్షాలతోనే పత్తి పంటకు తెగులు సోకుతోంది. మొక్కలు, ఆకులు, కాయలపై నల్లమచ్చలు ఏర్పడుతున్నాయి. తెగుళ్ల నివారణ కోసం అన్నదాతలు రైతువేదికలో ఏఈవోలను తక్షణమే సంప్రదించాలి.

– రామకృష్ణ, ఏఈవో, కొలనూర్, ఓదెల

ప్రభుత్వం ఆదుకోవాలి



మరో పదిహేను రోజుల్లో వరి పంట కోతకు వస్తుంది. ఈ సమయంలో భారీ వర్షాలు పడుతున్నయి. నాకున్న మూడెకరాల్లో ఏసిన పంటకు నష్టం జరిగింది. పంట నష్టపోయిన మాలాంటి రైతులను ప్రభుత్వమే ఆర్థికంగా ఆదుకోవాలి.

– భూసారపు శ్రీనివాస్, రైతు, కోనరావుపేట

కాయలు నల్లబడ్డాయి



నాకున్న మూడెకరాల్లో ఈ సారి పత్తి పంట ఏసిన. ఏకరాపై రూ. 30వేల చొప్పున పెట్టుబడి పెట్టిన. పత్తి పంట కాయ దశకు వచ్చింది. ఏకధాటి వానలతో వైరస్ సోకిందట. కాయలు నల్లగా, ఆకులు ఎర్రగా మారినయి.

– ఉప్పుల అనిత, రైతు, గూడెం

సూచనలు పాటించాలి

వాతావరణంలో వస్తున్న మార్పులు, భారీవర్షాలతోనే తెగుళ్లు ఆశిస్తున్నాయి. వాటి నివారణకు వ్యవసాయాధికారుల సూచన ప్రకారమే పురుగు మందులు వాడాలి. ఇందుకోసం స్థానిక ఏఈవోలను తప్పకుండా సంప్రదించాలి.

– శ్రీనివాస్, జిల్లా వ్యవసాయాధికారి

రెండోసారి పిచికారీ



నాకున్న రెండెకరాల్లో వరి ఏసిన. మెడవిరుపు పురుగు సోకడంతో ఒకసారి పురుగుల మందు కొట్టిన. భారీవానలతో పైరు ఎర్రబడుతంది. అగ్గితెగులు సోకిందంటున్నరు. అధికారుల సూచనతో మరోసారి మందు కొడుతున్న.

– గెల్లు శ్రీనివాస్, రైతు, సుల్తానాబాద్